


# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక :176 | ఆదివారం 29 జూన్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు రంగం సిద్ధం!



**న్యూస్ డెస్క్, 28 జూన్ (కెరటం న్యూస్):** తెలుగు రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల నియామకాలకు ముహూర్తం ఫిక్స్ అయ్యింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఒకే రోజు బీజేపీ అధిష్ఠానం అధ్యక్షులను ప్రకటించనుంది. బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. మూడు రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని అధిష్ఠానం నిర్ణయించింది. బీజేపీ రాష్ట్ర ఎన్నికల అధికారి, ఎంపీ పాకా సత్యనారాయణ విజయవాడలో ఈరోజు మీడియా సమావేశం నిర్వహించి.. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు.

## 'రా' కొత్త చీఫ్‌గా పరాగ్ జైన్

**రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్న జైన్**



## పదవుల కంటే మునుగోడు ప్రజలే నాకు ముఖ్యం..

● బీఆర్ఎస్ వెయ్యి ఏళ్లు అయినా అధికారంలోకి రాదు ● కేసీఆర్ రిటైర్డ్ అయ్యి ఫామ్‌హౌస్‌లో రెస్ట్ తీసుకుంటే మేలు - కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



## నేడు తెలంగాణకు అమిత్ షా..

**పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభోత్సవం**





# నగర అభివృద్ధిని అడ్డుకునే కుట్రలు జరుగుతున్నాయి

● పీజేఆర్ పేరుతో ఫ్లైఓవర్ ప్రారంభం - భాగ్యనగర అభివృద్ధికి కొత్త పుంతలు ● శేరిలింగంపల్లి నాలుగు నియోజకవర్గాలుగా మారుతుంది -2029 పునర్విభజనపై సీఎం ప్రకటన ● హైటెక్ సిటీకి పునాది పీజేఆర్.. అభివృద్ధికి చంద్రబాబూ పాత్రదారుడే ● ప్రాజెక్టులపై కేంద్ర నిర్లక్ష్యం - కేంద్రం సహకరించడం లేదు ● టాక్స్ మినహాయింపుతో హైదరాబాద్ విద్యుత్ వాహనాల దిశగా - కాలుష్య నివారణకు చర్యలు ● ఎన్ కన్వెన్షన్‌లో 2 ఎకరాల భూమి ప్రభుత్వానికి అప్పగించిన నాగార్జున నిజమైన హీరో ● హైదరాబాద్‌కు ప్రధాని మోదీ ఏమిచ్చారు? ● ఎన్నికల వరకే రాజకీయాలు.. ఆ తర్వాత అభివృద్ధిపైనే తమ దృష్టి - సీఎం రేవంత్ రెడ్డి

**న్యూస్ డెస్క్, 28 జూన్ (కెరటం న్యూస్):** 2029లో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోందని.. శేరిలింగంపల్లి 4 నియోజకవర్గాలుగా మారుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చడంలో పీజేఆర్‌ది కీలకపాత్ర అని కొనియాడారు. పీజేఆర్ కృషి వల్లే హైదరాబాద్‌కు గోదావరి, కృష్ణా జలాలు వచ్చాయని ఉద్ఘాటించారు. శనివారం పీజేఆర్ ఫ్లైఓవర్‌ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. కొండాపూర్-గచ్చిబౌలి మార్గంలో 6 లైన్లతో 1.2 కిలోమీటర్ల ఫ్లైఓవర్‌ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించింది. రూ.182.72 కోట్ల వ్యయంతో ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ వరకు ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టింది. పీజేఆర్ ఫ్లైఓవర్‌తో గచ్చిబౌలి చౌరస్తా దగ్గర ట్రాఫిక్ సమస్య తగ్గనుంది. పీజేఆర్ ఫ్లైఓవర్‌ని ప్రారంభించిన అనంతరం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధి కోసం చాలామంది హైదరాబాద్ వస్తుంటారని తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

పేదల నాయకుడిగా పీజేఆర్ గొప్పపేరు సంపాదించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. ప్రజలు ఎప్పుడు పిలిచినా పలికే నాయకుడు పీజేఆర్ అని అభివర్ణించారు. గతంలో పీజేఆర్ ఇల్లు ఒక జనతా గ్యారేజ్‌లా కనిపించేదని గుర్తుచేసుకున్నారు. జంటనగరాల్లో 25 ఏళ్లపాటు పీజేఆర్ శకం నడిచిందని గుర్తుచేసుకున్నారు. పీజేఆర్ మంత్రిగా ఉన్నప్పుడే హైటెక్ సిటీకి పునాది పడిందని తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

గతంలో హైటెక్ సిటీని ముందుకు తీసుకెళ్లింది చంద్రబాబే అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. భాగ్యనగర అభివృద్ధికి ఎవరూ అడ్డుపడినా ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# ఉద్యోగులకు త్వరలోనే నూతన ఆరోగ్య పథకం

**ఉద్యోగ జేఏసీ నేతలతో మంత్రి దామోదర రాజనర్సింహ**



**హైదరాబాద్ బ్యూరో, 28 జూన్ (కెరటం న్యూస్):** రాష్ట్రంలోని ఉద్యోగులకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గుడ్ న్యూస్ చెప్పారు. రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ అతి త్వరలోనే నూతన ఆరోగ్య పథకాన్ని అమల్లోకి తేనున్నట్టుగా తెలిపారు. శనివారం తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి సారథ్యంలో జేఏసీ నాయకులు రమేష్ పాక, ఎం.రాధ, బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, తదితరులు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదరకు లచ్చిరెడ్డి పలు విషయాలను వివరించారు. రాష్ట్రంలోని ప్రతి ఉద్యోగికి క్యాష్ లెస్ ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని కోరారు. గతంలోనే జేఏసీ పక్షాన ఇదే పథకానికి సంబంధించిన పూర్తిస్థాయి వివరాలను తమరికి అందచేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో సరైన ఆరోగ్య పథకం అమల్లో లేదన్నారు. దీంతో ఉద్యోగులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టుగా చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన డిప్యూటీ తహశీల్దార్ రాజేష్ ఖన్నా ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయి ఆస్పత్రిలో చేరడంతో అతడి కుటుంబం పడిన ఇబ్బందులను మంత్రికి లచ్చిరెడ్డి వివరించారు. జేఏసీ నాయకులుగా తాము రాజేష్ ఖన్నాకు అందించిన చేయూత గురించి మంత్రికి చెప్పారు. రాష్ట్రంలోని ఏ ఉద్యోగికి కూడా రాజేష్ ఖన్నా లాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే తక్షణమే నూతన ఆరోగ్య పథకాన్ని రాష్ట్రంలో ప్రవేశ పెట్టి అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో త్వరలోనే ఉద్యోగులకు సరికొత్త విధానంతో ఆరోగ్య పథకాన్ని అందుబాటులోకి తెస్తున్నట్టుగా ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. ఏ ఒక ఉద్యోగి బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండదన్నారు. గతంలో జేఏసీ ఏ పథకాన్ని అయితే కావాలని కోరిందో.. అదే త్వరలోనే అందుబాటులోకి రాబోతుందన్నారు.

# 33 మందికి అదనపు కలెక్టర్లుగా పదోన్నతి



## జైపాల్ రెడ్డి ఉన్నప్పుడే మెట్రో మంజూరైంది..

**మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు**



**న్యూస్ డెస్క్, 28 జూన్ (కెరటం న్యూస్):** శనివారం పీజేఆర్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూపీఏ ప్రభుత్వంలో జైపాల్ రెడ్డి ఉన్నప్పుడే హైదరాబాద్‌కు మెట్రో మంజూరైందని గుర్తుచేశారు. అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో వేగంగా మెట్రో పనులు చేశాం.. ఇప్పుడు కూడా కాంగ్రెస్ హయాంలోనే మెట్రో విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు.

## కన్నతల్లి పై పెట్రోల్ పోసి నిప్పట్టించిన కసాయి కొడుకు



## సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్..!

● దస్త్రంపై సీఎం సంతకం కావడంతో వేగవంతమైన ప్రక్రియ
● త్వరలోనే క్షేత్రస్థాయిలోకి జీపీఓలు
● జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి సారథ్యంలో సీసీఎల్ఏను కలిసిన సంఘాల నేతలు
● రెవెన్యూ ఉద్యోగ సంఘాల నేతలతో సీసీఎల్ఏ లోకేష్‌కుమార్



**హైదరాబాద్ బ్యూరో, 28 జూన్ (కెరటం న్యూస్):** సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల (అడిషనల్ కలెక్టర్) పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి కోరారు. అర్హత కలిగిన 33 మందికి సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు (అడిషనల్ కలెక్టర్)గా పదోన్నతులు కల్పించాలన్నారు. శనివారం లచ్చిరెడ్డి సారథ్యంలో సీసీఎల్ఏ లోకేష్‌కుమార్‌ను డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం కలిశారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ లోకేష్‌కుమార్ దృష్టికి పలు విషయాలను తీసుకెళ్లారు.

**పదోన్నతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయండి**

ప్రజాపాలనలో రాష్ట్రంలో తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల (అడిషనల్ కలెక్టర్) పోస్టులను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని ఈ సందర్భంగా లచ్చిరెడ్డి సీసీఎల్ఏ లోకేష్‌కుమార్‌కు వివరించారు. ఈ పోస్టులకు అర్హత కలిగిన వారికి పదోన్నతులను కల్పించాలని కోరారు. దీనిపై లోకేష్‌కుమార్ సానుకూలంగా స్పందించారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు రంగం సిద్ధం!

మొదటి పేజీ తరువాయి

పాకా సత్యనారాయణ మాట్లాడుతూ 'అంతర్గత ప్రజాస్వామ్యం పాటిస్తున్న ఏకైక పార్టీ బీజేపీ. రేపు అధ్యక్ష ఎన్నిక నోటిఫికేషన్ జారీ అవుతుంది. 30న ఉదయం 11 నుంచి 1 వరకూ నామినేషన్ స్వీకరణ ప్రక్రియ ఉంటుంది. 30న మధ్యాహ్నం 1 నుంచి 2 వరకూ నామినేషన్ల స్క్రూటిని నిర్వహిస్తారు. సాయంత్రం 4 లోపు ఉపసంహరణకు గడువు. జూలై 1న అధ్యక్ష ప్రకటన, బాధ్యతల స్వీకరణ ఉంటుంది. జాతీయ కౌన్సిల్ పీసీ మోహన్ ఎన్నికల అబ్జర్వర్‌గా ఉంటారు' అని చెప్పారు.

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక కోసం ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. సోమవారం నామినేషన్లు స్వీకరిస్తారు. జులై 1న ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ మేరకు బీజేపీ పార్టీ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం దగ్గుబాటి పురందేశ్వరి, కిషన్ రెడ్డిలు తెలుగు రాష్ట్రాలకు అధ్యక్షులుగా ఉన్నారు.

# నగర అభివృద్ధిని అడ్డుకునే కుట్రలు జరుగుతున్నాయి

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల వరకే రాజకీయాలు.. ఆ తర్వాత అభివృద్ధిపైనే తమ దృష్టి అని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా మార్చాలని కోరారు. అభివృద్ధిలో స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు వెళు_న్నామని అన్నారు. రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులను తెచ్చేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను కొందరూ అడ్డుకునే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయం ముసుగులో అవాంతరాలు కల్పిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కేంద్రం సహకరించడం లేదు**

'హైదరాబాద్‌లో ఆర్టీసీ డీజిల్ బస్సులు ఉండొద్దని నిర్ణయించాం. డీజిల్ బస్సులను జిల్లాలకు తరలించాలని ఆదేశించాం. హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను మినహాయింపు. ఆటోలు కూడా సిఎన్జి, ఎలక్ట్రిక్ వెర్షన్‌లోకి మారాలి. హైదరాబాద్ నగరంలో



అనేక నాలాలు, చెరువులు కబ్జాకు గురయ్యాయి. ఆక్రమణలకు గురైన వాటిని హైడ్రా ద్వారా తొలగిస్తున్నాం. ఎన్ కన్వెన్షన్‌లో రెండెకరాలను ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించి.. నటుడు నాగార్జున నిజమైన హీరో అనిపించుకున్నారు. రంగారెడ్డి జిల్లాకు శ్రీధర్‌బాబును ఇన్‌చార్జి మంత్రిగా చేశాం. రంగారెడ్డి జిల్లా అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలి. మెట్రో, మూసీ ప్రాజెక్టులకు కేంద్రం సహకరించడం లేదు. రేపు అమిత్ షా తెలంగాణకు వస్తున్నారు.. మరోసారి కలిసి విజ్ఞప్తి చేస్తాం. రాజకీయాలు వదిలేసి హైదరాబాద్ అభివృద్ధికి కలిసి పనిచేద్దాం.నేను దాదాపు 35 సార్లు ఢిల్లీ వెళ్లా. ప్రధాని సహా అనేకమంది కేంద్రమంత్రులను కలిశా. కానీ రాష్ట్రానికి కేంద్రం నుంచి చెప్పుకోదగ్గ ప్రాజెక్టులు రాలేదు. హైదరాబాద్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏం ఇచ్చారు. ఈ విషయం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆలోచించుకోవాలి. తెలంగాణ ప్రజలు బీజేపీకి 8 మంది ఎంపీలను ఇచ్చారు. కేంద్రం నుంచి బీజేపీ నేతలు ఏం తెచ్చారో చెప్పగలరా' అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

# జైపాల్ రెడ్డి ఉన్నప్పుడే మెట్రో మంజూరైంది..


## మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు

**న్యూస్ డెస్క్, 28 జూన్ (కెరటం న్యూస్):** హైదరాబాద్ మెట్రో పై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం పీజేఆర్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూపీఏ ప్రభుత్వంలో జైపాల్ రెడ్డి ఉన్నప్పుడే హైదరాబాద్‌కు మెట్రో మంజూరైందని గుర్తుచేశారు. అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో వేగంగా మెట్రో పనులు చేశాం.. ఇప్పుడు కూడా కాంగ్రెస్ హయాంలోనే మెట్రో విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో విస్తరణ విషయంలో కదలిక లేదని విమర్శించారు. మెట్రో విస్తరణ కోసం ఇప్పటికే కేంద్రానికి డీపీఆర్‌లు పంపించామని తెలిపారు. కేంద్రం నుంచి అతి త్వరలోనే అనుమతి వస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం కేంద్రం వద్దకు ఎన్ని సార్లు అయినా వెళ్తామని ప్రకటించారు.

ఇదిలా ఉంటే.. మెట్రో రైలు రెండో దశ(బీ) నిర్మాణ ప్రాజెక్టుకు ఇటీవలే ముందడుగు పడిన విషయం తెలిసిందే. తెలంగాణ సర్కారు రూ.19,579 కోట్లతో 81.6 కిలో మీటర్ల మేర మూడు కారిడార్లకు పరిపాలనా పరమైన అనుమతి ఇచ్చింది. కారిడార్ 9లో రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ (స్కిల్స్ యూనివర్సిటీ) వరకు 39.6 కిలోమీటర్లు, కారిడార్ 10లో జేబీఎస్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కిలో మీటర్లు, కారిడార్ 11లో జేబీఎస్ నుంచి శామీర్ పేట వరకు 22 కిలో మీటర్ల మేర మెట్రో రైలు నిర్మాణాన్ని చేపట్టనున్నారు.

# వ్యక్తిత్వ విధ్వంసం జర్నలిజం కాదు: మాజీ మంత్రి హరీష్ రావు

**న్యూస్ డెస్క్, 28 జూన్ (కెరటం న్యూస్):** ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై మహా న్యూస్ ఛానెల్ వరుసగా చేసిన కథనాలపై మాజీ మంత్రి హరీష్ రావు స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన జర్నలిజంపై ప్రశ్నలు వేస్తూ.. ఆసక్తికర ట్వీట్ చేశారు. అందులో "ఒక మీడియా ఛానల్ కొత్త స్థాయికి దిగజారి, మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై అసభ్యకరమైన, వ్యక్తిగత దాడులను ప్రసారం చేస్తూ, రాజకీయ అజెండాను ముందుకు తీసుకువెళ్లింది. ప్రతి నాయకుడి వెనుక ఒక కుటుంబం ఉంటుందని మీడియా సంస్థలు గుర్తుంచుకోవాలి. వ్యక్తిత్వ విధ్వంసం జర్నలిజం కాదు, అది దురుద్దేశం.



ఈ దుర్మార్గపు ప్రచారానికి వ్యతిరేకంగా చట్టపరమైన చర్యలు తీసుకునే హక్కు కేటీఆర్‌కు ఉంది. ఈ వ్యవహారంలో మేము కేటీఆర్‌కు పూర్తి మద్దతుగా నిలుస్తాము" అని రాసుకొచ్చారు. ఇదిలా ఉంటే కేటీఆర్ పై మహా న్యూస్ ఛానెల్ చేసిన ఆరోపణలు, కథనాలపై ఆగ్రహించిన బీఆర్ఎస్వీ నేతలు ఈ రోజు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం న్యూస్ యాజమాన్యం తో వాగ్వాదానికి దిగి.. కార్యాలయంలోకి దూసుకెళ్లారు. ఈ క్రమంలో ఆఫీస్‌లోని ఫర్నీచర్ ధ్వంసం చేశారు. ఈ దాడిపై తెలుగు రాష్ట్రాల సీఎంలతో పాటు డిప్యూటీ సీఎంలు, మంత్రులు, రాజకీయ నేతలు స్పందించి.. బీఆర్ఎస్వీ దాడిని ఖండించిన విషయం తెలిసిందే.

# సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్..!

### దస్త్రంపై సీఎం సంతకం కావడంతో వేగవంతమైన ప్రక్రియ

### త్వరలోనే క్షేత్రస్థాయిలోకి జీపీఓలు

### జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి సారథ్యంలో సీసీఎల్ఏను కలిసిన సంఘాల నేతలు

### రెవెన్యూ ఉద్యోగ సంఘాల నేతలతో సీసీఎల్ఏ లోకేష్‌కుమార్

మొదటి పేజీ తరువాయి



దీనికి సంబంధించిన దస్త్రంపై సీఎం రేవంత్‌రెడ్డి సంతకం కూడా అయిపోయిందని అతి త్వరలోనే పదోన్నతుల ప్రక్రియను చేపట్టి పోస్టులను కూడా భర్తీ చేయనున్నట్టుగా హామీ ఇచ్చారు.

**జీపీఓలకు క్షేత్రస్థాయిలో విధులు కేటాయించండి**

గ్రామానికో రెవెన్యూ అధికారి క్షేత్రస్థాయిలో పని చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పాలనా అధికారుల(జీపీఓ) నియామక ప్రక్రియను చేపట్టిందని లచ్చిరెడ్డి సీసీఎల్ఏ లోకేష్‌కుమార్‌కు వివరించారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి నియామకాల కోసం అర్హత పరీక్షను సైతం నిర్వహించి తుది జాబితాను కూడా వెల్లడించడం కూడా జరిగిందన్నారు. వీరందరికి క్షేత్రస్థాయిలో విధులను కేటాయించి బాధ్యతలను అప్పగించాలని కోరారు. ఇప్పటికే రెవెన్యూ సదస్సులతో క్షేత్రస్థాయిలో ప్రతి మండలంలోనూ వేలాది దరఖాస్తులు వచ్చాయన్నారు. మరోవైపు ఉన్న రెవెన్యూ అధికారులు, సిబ్బందిపైనే పని భారం కూడా పెరిగిందన్నారు. జీపీఓలను విధుల్లోకి తీసుకోవడంతో చాలా వరకు ఒత్తిడి తగ్గుతుందన్నారు. దీనిపై లోకష్‌కుమార్ సానుకూలంగా స్పందించారు. రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో చర్చించి త్వరలోనే ఈ ప్రక్రియను పూర్తి చేసేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తహశీల్దార్ల సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.రాధ, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాత చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.

# 'రాజీవ్ గాంధీ' అని పేరు మార్చుకో.. సీఎం రేవంత్‌కు కేటీఆర్ సూచన



**న్యూస్ డెస్క్, 28 జూన్ (కెరటం న్యూస్):** తెలంగాణలో రూ.5 భోజనం 'అన్నపూర్ణ' పథకం పేరు మార్చడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్చడం హాస్యాస్పదం, సిగ్గుచేటు అని మండిపడ్డారు. ఢిల్లీ బాసుల ముందు మార్కులు కొట్టేయడానికి ఇంతలా దిగజారాలా? అని ప్రశ్నించారు. అంత అవసరం ఉంటే మీ పేరు మార్చుకోవవచ్చు కదా? అని సీరియస్ అయ్యారు. రేవంత్ రెడ్డి తన పేరు మార్చుకొని.. రాజీవ్ గాంధీ లేదా? జవహర్ లాల్ నెహ్రూ అని మార్చుకుంటే బావుంటుందని కదా అని సూచించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ అర్థరహిత చర్యలన్నింటినీ రద్దు చేస్తామని కీలక ప్రకటన చేశారు. కాగా, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) స్టాండింగ్ కమిటీలో అన్నపూర్ణ అనే పేరు మార్చి 'ఇందిరా క్యాంటీన్'గా ఖరారు చేశారు. ఈ పేరు మార్పు కేవలం నామమాత్రమే కాదు, పథకం స్వరూపాన్ని, అందించే సేవలను కూడా విస్తృతం చేయాలనే అని ప్రభుత్వ పెద్దలు చెప్పారు.

# పదవుల కంటే

## మునుగోడు ప్రజలే నాకు ముఖ్యం..

**న్యూస్ డెస్క్, 28 జూన్ (కెరటం న్యూస్):** తెలంగాణలో బీఆర్ఎస్ వెయ్యి ఏళ్లు అయినా అధికారంలోకి రాదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ రిటైర్డ్ అయ్యి ఫామ్‌హౌస్‌లో రెస్ట్ తీసుకుంటే మేలని అన్నారు.2018లో రాష్ట్రంలో బడా బడా లీడర్లు సైతం ఓడిపోయారన్నారు. తనపై నమ్మకంతో మునుగోడు ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపించారని అన్నారు. ఆ సమయంలో కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండడంతో కేసీఆర్ తమ గొంతు నొక్కేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ అసెంబ్లీలో మునుగోడు నియోజకవర్గ సమస్యలపై గళం వినిపించానని చెప్పారు. మునుగోడు కోసం అందరు ఎమ్మెల్యేల కంటే ఎక్కువ మాట్లాడానని అన్నారు.

మునుగోడుకు పూర్తిగా నిధులు ఇవ్వకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశానన్నారు. ఎల్బీ నగర్ నుండి పోటీ చేస్తే మంత్రి పదవి కూడా ఇస్తామని హామీ ఇచ్చారని కానీ తనకు పదవుల కంటే మునుగోడు ప్రజలే ముఖ్యమని చెప్పారు. మంత్రి పదవిని కూడా పక్కనపెట్టి మునుగోడు ప్రజల కోసం పని చేశానని అన్నారు. బీజేపీ నుండి కాంగ్రెస్ లోకి వస్తే తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. తరవాత పార్లమెంట్ ఎన్నికల సమయంలో చామలను ఎంపీగా గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని చెప్పారన్నారు. తనకు పదవి ఇవ్వకపోయినా పర్వాలేదని కానీ నియోజకవర్గానికి అన్యాయం చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. ప్రజలు తనను నమ్మి గెలిపించారని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని అన్నారు.

# ఎన్నికలు ఎప్పుడు వచ్చినా BRSకు 100 సీట్లు...మాజీ మంత్రి కామెంట్స్ !

**న్యూస్ డెస్క్, 28 జూన్ (కెరటం న్యూస్):** తెలంగాణ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా... గులాబీ పార్టీ 100 సీట్లు గెలుచుకుంటుందని సంచలన వ్యాఖ్యలు చేశారు ఎర్రబెల్లి దయాకర్ రావు. తాజాగా వరంగల్ లో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడారు.



ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పైన జనాల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాంగ్రెస్ పై ఉన్న వ్యతిరేకతతో... గులాబీ పార్టీకి మేలు జరుగుతుందని వివరించారు. అందుకే ఎన్నికలు ఎప్పుడు జరిగినా కూడా గులాబీ పార్టీకి... 100 సీట్లు రావడం గ్యారెంటీ అన్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా గులాబీ పార్టీ ఎక్కువ స్థానాలు గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు ఎర్రబెల్లి దయాకర్ రావు.

రెండు నెలల పాటు అన్ని పనులు పక్కన పెట్టి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలు, నేతలకు దిశా నిర్దేశం చేశారు. గులాబీ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించాలని సూచనలు చేశారు. అప్పుడే గులాబీ పార్టీ మరింత వేగంగా జనాల్లోకి వెళుతుందని వెల్లడించారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉంటేనే తెలంగాణకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. కాగా.. దాదాపు 30 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉన్న దయాకర్ రావు... యంగ్ లీడర్ యశస్విని రెడ్డి పై ఓడిపోయిన సంగతి తెలిసిందే.

# హర్షం వ్యక్తం చేసిన డిప్యూటీ కలెక్టర్ల సంఘం

## సీఎం, రెవెన్యూ మంత్రి, ఇతర ప్రభుత్వ పెద్దలకు ధన్యవాదాలు తెలిపిన వి.లచ్చిరెడ్డి

**హైదరాబాద్ బ్యూరో, 28 జూన్ (కెరటం న్యూస్):** రెవెన్యూ చరిత్రలోనే తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్స్(అదనపు కలెక్టర్లు)గా నియామకాన్ని చేపట్టిందని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ తెలిపారు. 33 మందికి అదనపు కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ శనివారం జీవో విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి, ఇతర ప్రభుత్వ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. రెవెన్యూ వ్యవస్థలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టునే చివరిదిగా ఉండేదని ఈ సందర్భంగా లచ్చిరెడ్డి, రామకృష్ణ తెలిపారు. ఇదే విషయమై డిప్యూటీ కలెక్టర్ల సంఘంగా ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి దానిని సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్(అదనపు కలెక్టర్) గా 33 పోస్టులను సాధించామన్నారు. రెవెన్యూ చరిత్రలోనే తొలిసారిగా 33 మందికి అదనపు కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. ఇది రెవెన్యూ చరిత్రలో నిలిచి పోయే అంశంగా పేర్కొన్నారు.




# కన్నతల్లి పై పెట్రోల్ పోసి నిప్పట్టించిన కసాయి కొడుకు



**న్యూస్ డెస్క్, 28 జూన్ (కెరటం న్యూస్):** సంగెం మండలంలోని కుంటపెల్లి గ్రామానికి చెందిన తల్లి వినోద (50) పై తన కొడుకు సతీష్ పెట్రోల్ పోసి నిప్పంటించినాడు. తీవ్ర గాయాలైన వినోదను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం 80 శాతం ఖాళీ ఆమె పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు. సతీష్ పరారి లో ఉన్నట్లు తెలిసింది. ఆస్తి పంపకాల విషయంలో సతీష్ ఈ దారుణానికి ఒడిగట్టినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది .

# నేడు తెలంగాణకు అమిత్ షా..

## పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభోత్సవం



**న్యూస్ డెస్క్, 28 జూన్ (కెరటం న్యూస్):** నేడు తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రానున్నారు. నేడు ఉదయం 11.25 గంటలకు గుజరాత్ లోని అహ్మదాబాద్ ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1 గంటకు బేగంపేట విమానశ్రయానికి చేరుకోనున్నారు. మధ్యాహ్నం 1.45 గంటలకు బేగంపేట్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్ లో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకోనున్నారు. అక్కడి నుంచి వినాయక్ నగర్ లో జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్నీ ప్రారంభించడానికి వెళ్లనున్నారు.

ఇక, మధ్యాహ్నం 2 గంటలకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. 2 నుంచి 2.30 వరకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయంలోనే ఉండనున్నారు. మధ్యాహ్నం 2.35 గంటలకు నిజామాబాద్ లోని కంటేశ్వర్ క్రాస్ రోడ్ లో ఏర్పాటు చేసిన డి శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. 2.45 నుంచి 4 గంటల వరకు పాలిటెక్నిక్ గ్రౌండ్ లో జరిగే కిసాన్ మహా బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. సాయంత్రం 5 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్టుకు చేరుకుని ఢిల్లీకి తిరుగు ప్రయాణం అవుతారు.

# 'రా' కొత్త చీఫ్‌గా పరాగ్ జైన్ - రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్న జైన్



**న్యూస్ డెస్క్, 28 జూన్ (కెరటం న్యూస్):** భారత గూఢచార సంస్థ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా) నూతన అధిపతిగా సీనియర్ ఐపీఎస్ అధికారి పరాగ్ జైన్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత చీఫ్ రవి సిన్హా పదవీకాలం జూన్ 30తో ముగియనున్న నేపథ్యంలో ఈ నియామకం జరిగింది. జూలై 1 నుంచి పరాగ్ జైన్ రెండేళ్ల పాటు ఈ కీలక బాధ్యతలను నిర్వర్తిస్తారు. 1989 బ్యాచ్‌కు చెందిన పంజాబ్ కేడర్ ఐపీఎస్ అధికారి అయిన పరాగ్ జైన్, గతంలో పంజాబ్ డీజీపీగా కూడా సేవలు అందించారు. 2021 జనవరి 1న ఆయన డీజీపీ హోదా పొందారు. ఆయన నియామకానికి క్యాబినెట్ నియామకాల కమిటీ జూన్ 2న ఆమోదముద్ర వేసింది. గూఢచార వర్గాల్లో పరాగ్ జైన్‌కు 'సూపర్ స్లూత్' అనే పేరుంది.

# ఇరువురు జర్నలిస్టుల కు రూ.20 వేల ఆర్థిక సాయం

## టీయూ డబ్ల్యూయుజె (టీజేఎఫ్) ఔదార్యం



**ఖమ్మం బ్యూరో, 28 జూన్ (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లా కేంద్రంలో పని జర్నలిస్టులుగా పనిచేస్తున్న ఇరువురు జర్నలిస్టు లకు టీయూ డబ్ల్యూయుజె(టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి మరియు యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నెబొయిన సాంబశివరావు ల ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం చేసి ఔదార్యం చాటుకుంది. నమస్తే తెలంగాణ పత్రిక స్టాఫ్ ఫోటోగ్రాఫర్ బండారి మహేష్ తల్లి బండారి రమణ శుక్రవారం బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో అకాల మరణం చెందారు. శనివారం రేవతి సెంటర్ లో ఉన్న మహేష్ స్వగృహానికి వెళ్లిన టీయూ డబ్ల్యూయుజె (టీజేఎఫ్) జర్నలిస్టు బృందం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ మహేష్ కుటుంబాన్ని పరామర్శించి, సానుభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. కుటుంబ ఖర్చుల నిమిత్తం తక్షణ సహాయంగా ఆకుతోట ఆదినారాయణ రూ.10 వేలు ఆర్థిక సహాయం ను అందజేశారు.

అధైర్యం చెందకు అండగా ఉంటాం...

ఖమ్మం ప్రభుత్వ హాస్పిటల్ లో కామెర్ల వ్యాధితో చికిత్స పొందుతున్న సాక్షి టివి ఛానల్ స్టాఫ్ వీడియో జర్నలిస్టుగా పనిచేస్తున్న సతీష్ ను శనివారం హాస్పిటల్ కు వెళ్లి టీయూ డబ్ల్యూయుజె (టీజేఎఫ్) బృందం పరమర్శించింది. జర్నలిస్టు ఆరోగ్య పరిస్థితి ని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవిలు అధైర్యం చెందోద్దని యూనియన్ అండగా ఉంటోందని భరోసా ఇచ్చారు. ఎలాంటి అవసరం ఉన్న తమ దృష్టికి తీసుకు రావాలని నాయకులు కోరారు.మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. సతీష్ కు యూనియన్ తరుపున తక్షణ సహాయంగా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకుంది. అనంతరం ప్రెస్ క్లబ్ లో టివి న్యూస్ రీడర్ గా పనిచేసి శనివారం ఆత్మహత్య చేసుకున్న స్వేచ్ఛ మృతికి జర్నలిస్టుల బృందం నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో సాక్షి టివి బ్యూరో చీఫ్ మహేందర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీకాంత్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుద్దేటి రమేష్ బాబు, రాంబాబు, కోశాధికారి బిక్కి గోపి, జిల్లా ఉపాధ్యక్షులు సరస్వతి భట్ల శ్రీధర్ శర్మ, ఎలక్ట్రానిక్ మీడియా టౌన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు యలమందుల జగదీష్, అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు టీఎస్ చక్రవర్తి, జిల్లా నాయకులు ఉట్ల వెంకట సాయికృష్ణ, గంటెలా కుమార్, మీడియా ఇంచార్జ్ తిరుపతి రావు, సాయి, వీడియో జర్నలిస్టులు వడ్డే పృధ్వి, గణేష్, బుర్లా రాజు, సునీల్, హరి, ముత్యాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# సట్ల అంజలికి ఎంపీ వద్దిరాజు ఘన నివాళులు



**ఇనుగుర్తి, 28 జూన్ (కెరటం న్యూస్):** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో దివంగత గాయకురాలు సట్ల అంజలి చిత్రపటానికి పూలుజల్లి ఘనంగా నివాళు లర్పించారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి మంచి గాయకురాలుగా పేరు సంపాదించుకున్న ఆమె హత్యకు గురవ్వడం తీవ్ర బాధాకరమని ఎంపీ రవిచంద్ర అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర అంజలి తల్లి ధనమ్మ,సోదరి శోభ, చిన్న కూతురు మనస్విని తదితర కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు, కుటుంబానికి అండగా ఉంటానని భరోసానిచ్చారు.



# ఎంపీ వద్దిరాజు స్వగ్రామంలో పలువురికి పరామర్శ



**ఇనుగుర్తి, 28 జూన్ (కెరటం న్యూస్):** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో ఇటీవల మృతి చెందిన స్వర్గీయ అనుమాండ్ల సోమిరెడ్డి చిత్రపటానికి పూలుజల్లి ఘనంగా నివాళులర్పించారు.సోమిరెడ్డి కుమారుడు-కోడలు యాకూబ్ రెడ్డి-సుమలత, వారి కుటుంబ సభ్యులను ఎంపీ రవిచంద్ర పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు వెంట మాజీ సర్పంచ్ దార్ల రాంమూర్తి, కేసముద్రం సింగిల్ విండో ఛైర్మన్ వెంకన్న గౌడ్, నాయకులు మహేందర్ రెడ్డి, పింగళి శ్రీనివాస్, గుజ్జునూరి బాబూరావు,గండు నాగన్న, బేతమళ్ల చంద్రయ్య, గడ్డం వెంకన్న గాడుదుల రాజన్న తదితరులు ఉన్నారు.

# ఎంపీ వద్దిరాజు తన అన్నలతో కలిసి శాగంటి లక్ష్మీకి నివాళులు



**ఇనుగుర్తి, 28 జూన్ (కెరటం న్యూస్):** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన అన్నలు వద్దిరాజు కిషన్, దేవేందర్ తదితర ప్రముఖులతో కలిసి స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో స్వర్గీయ శాగంటి లక్ష్మీకి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీ రవిచంద్ర వద్ద కారు డ్రైవరుగా పని చేస్తున్న సురేష్ మాతృమూర్తి లక్ష్మీ ఈనెల 19వతేదీన మృతి చెందారు.స్వర్గీయ లక్ష్మీ దశదిన కర్మకాండ శనివారం ఇనుగుర్తిలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర తన అన్నలు కిషన్, దేవేందర్ తదితర ప్రముఖులతో కలిసి హాజరై లక్ష్మీ చిత్రపటానికి పూలుజల్లి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె కుమారులు జంపయ్య, సురేష్, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను ఎంపీ రవిచంద్ర, కిషన్, దేవేందర్ లు పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు వెంట మాజీ సర్పంచ్ దార్ల రాంమూర్తి, కేసముద్రం సింగిల్ విండో ఛైర్మన్ వెంకన్న గౌడ్, నాయకులు గుజ్జునూరి బాబూరావు, గండు నాగన్న, బేతమళ్ల చంద్రయ్య, గడ్డం వెంకన్న, గాడుదుల రాజన్న తదితరులు ఉన్నారు.

# నేడు సినీ సంగీత విభావరి



**ఖమ్మం టౌన్, 28 జూన్ (కెరటం న్యూస్):** స్వర సుధా మ్యూజిక్ యూనిట్ ఖమ్మం వారి 33వ వార్షికోత్సవ సందర్భంగా ఈరోజు 29.6.205 న ఆదివారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రం నందు సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి 10 గంటల వరకు సంగీత విభవాని నిర్వహిస్తున్నాం నిర్వాహకులు తెలియజేసినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు గౌరవనీయులు తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ ఖమ్మం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీ వై హనుమంతరావు మొదలగువారు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు ఈ కార్యక్రమానికి సృజనహిత డాక్టర్ శ్రీమతి వనం కృష్ణవేణి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందని తెలియజేసినారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా కే మాధవరావు ఉపాధ్యక్షులుగా వి.వి రెడ్డి కోశాధికారి పి.జే వినయ్ కుమార్ వేదిక పర్యవేక్షకులు పిన్నేల్లి యాదగిరి తదితరులు కార్యక్రమంలో పాల్గొంటారు ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఈ సందర్భంగా వారు కోరారు.

# గన్ని సంచులకు 60 రూ. లు చెల్లించాలి

## ఖమ్మం మార్కెట్ ఛైర్మన్ హనుమంతరావుకు వినతి

**ఖమ్మం టౌన్, 28 జూన్ (కెరటం న్యూస్):** ఖమ్మం మార్కెట్ లో రైతులకు గన్ని సంచులకు కేవలం 25 రూ. లు మాత్రమే ఇస్తున్నారు. బయట రైతులు 80 రూ. లు పెట్టి కొనుగోలు చేస్తున్నారని, దీని వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అఖిల పక్ష రైతు సంఘాల నాయకులు ఖమ్మం మార్కెట్ ఛైర్మన్ ను శనివారం కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సంధర్భంగా రైతు సంఘ నేతలు మాట్లాడుతూ ఎప్పటి నుండో గన్ని సంచులకు కేవలం 25 రూ. లు మాత్రమే చెల్లిస్తున్నారని దీనివలన బయట ఎక్కువ ధర చెల్లించి కొనటం వల్ల రైతులు ఈ సంచులకే అధిక మొత్తం చెల్లించి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుల పరిస్థితి అర్థం చేసుకొని వారం రోజుల లోపు రైతులకు 60 రూ. లు చెల్లించాలని కోరారు. 60 రూ. లు చెల్లించనిచో అఖిల పక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులను సమీకరించి ఆందోళన చేపడతామని మార్కెట్ ఛైర్మన్ కు వివరించారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ కె వి ఏ మీరా, సి పి ఐ రైతు సంఘం దొండపాటి రమేష్, రైతు సమితి సీనియర్ నాయకులు రామాకోటయ్య, ఎం. ఎల్. రైతు సంఘం నుంచి కోలేటి నాగేశ్వరరావు, మాస లైన్ రైతు సంఘం నాయకులు కేలోతు నాగేశ్వరరావు, కాంగ్రెస్ రైతు సంఘం నుంచి మొక్క శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలను విస్మరిస్తే పాలకవర్గాల పతనం తప్పదు

## సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు.



**ఖమ్మం త్రీ టౌన్, 28 జూన్ (కెరటం న్యూస్):** ప్రజలను విస్మరిస్తే పాలకవర్గాలు పతనం కాక తప్పదు. అని సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఈరోజు సిపిఎం ఖమ్మం 3 టౌన్ కమిటీ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులు బోస్ సెంటర్లోని ఆదిలక్ష్మి కోల్డ్ స్టోరేజ్ లో ప్రారంభమైనాయి. రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభానికి ముందు పార్టీ జెండాని సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వజేనేపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. క్లాసులు ప్రారంభానికి ముందు ప్రారంభ ఉపన్యాసం సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ మాట్లాడారు. అనంతరం జరిగిన క్లాస్ కు సిపిఎం ఖమ్మం 3 టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు. అనంతరం రాజకీయ తీర్మానం క్లాసును సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు చెప్పారు. ఇంకొక క్లాసును సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు పార్టీ కార్యక్రమం క్లాసుని బోధించారు.ఈ సందర్భంగా సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచంలో అయినా కేంద్రంలో అయినా రాష్ట్రంలో అయినా ఎక్కడైనా సరే ప్రజలను పాలకవర్గాలు విస్మరిస్తే పతనం కాక తప్పదు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడంలో విఫలమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం మూడుసార్లు అధికారంలోకి వచ్చింది అధికారంలోకి వచ్చిన మూడుసార్లు కూడా ప్రజలకు అనేక వాగ్దానాలు చేసింది మొదటి వాగ్దానం స్విస్ బ్యాంకులలో ఉన్న పెట్టుబడిదారుల నల్ల డబ్బులను భారతదేశానికి రప్పించి ప్రజల ఖాతాలలో ఒక్కొక్క కుటుంబానికి 15 లక్షల రూపాయలు వేస్తానని చెప్పడం జరిగింది. అంతేకాకుండా సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని నిరుద్యోగులని నమ్మ పలికాడు కానీ ఇంత మటుకు ఒక్క లక్ష ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు మోడీ చెప్పిన ప్రకారం ఇప్పటివరకు అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు అవుతుంది ఈ 11 సంవత్సరాలు కాలంలో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు చొప్పున 22 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి కానీ ఈ వాగ్దానాన్ని కూడా మరిచారు. అంతేకాకుండా అధికారం చేతిలో ఉందని మోడీ ఏకాభిప్రాయం వలన పెద్ద నోట్ల రద్దును అర్ధాంతరంగా రద్దు అని ప్రకటించాడు దానివలన చాలామంది ప్రజలు బ్యాంకుల దగ్గర క్యూ లలో నిలబడి ప్రాణాలు కోల్పోయారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో చాలా వైఫల్యం చెందింది ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తా ఉంది భవిష్యత్తులో రాబోవు కాలంలో ప్రజల అహంకారానికి ఈ ప్రభుత్వాలు పతనం కాక తప్పదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు బండారు యాకయ్య, సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు పత్తిపాక నాగ సులోచన, సిపిఎం ఖమ్మం డివిజన్ నాయకులు యర్రా గోపి,షేక్ హిమామ్,యర్రా. రంజిత్, సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ సైదులు, బండారు వీరబాబు, శీలం వీరబాబు,యర్రా. మల్లికార్జున్, సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ నాయకులు పోతురాజు జార్జి, నాయిని నరసింహారావు, షేక్ ఖాసిం,సారంగి పాపారావు, బండారు సునీత, చీకటిమల్ల శ్రీనివాసరావు, వేల్పుల నాగేశ్వరరావు, పాశం సత్యనారాయణ, గబ్బేటి పుల్లయ్య, షేక్ మస్తాన్, యర్రా నగేష్ ,షేక్ అమీనా, కొట్టే అలివేలు, తదితరులు పాల్గొన్నారు.



కెరటం న్యూస్

ఆదివారం 29 జూన్ 2025

# రాష్ట్రానికి ఆదర్శంగా ఖమ్మం జిల్లా వ్యవసాయ రంగం అభివృద్ధి

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

### ఎరువుల, విత్తనాల కొరత రాకుండా పటిష్ట చర్యలు

### ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటల సాగును ప్రోత్సహించాలి



**ఖమ్మం బ్యూరో, 28 జూన్ (కెరటం న్యూస్):** రాష్ట్రానికి ఆదర్శంగా ఖమ్మం జిల్లా వ్యవసాయ రంగం అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో శనివారం వ్యవసాయ, ఉద్యానవన శాఖల పని తీరుపై అధికారులతో సమీక్షించారు. వ్యవసాయ సాగు, ఎరువులు, విత్తనాల లభ్యత, రైతు భరోసా, రైతు భీమా, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం వంటి పలు అంశాలపై జిల్లా కలెక్టర్ మండలాల వారీగా చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఆధునిక సాగు పద్ధతులు పాటించడం, పంటల మార్పిడి విధానం అమలు వంటి కార్యక్రమాల్లో మన జిల్లా, రాష్ట్రంలో ఆదర్శవంతంగా తయారు చేయాలని సూచించారు. ఎరువులు, విత్తనాల లభ్యత పట్ల ఎటువంటి ఫిర్యాదులు రాకుండా మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. విత్తనాల నాణ్యత చాలా కీలకంగా పరిగణించాలని, ఎక్కడ కల్తీ విత్తనాలు విక్రయం జరగకూడదనీ, ఎరువులు, విత్తనాల లభ్యత లేక రైతులు లైన్ లో ఉన్నారు అనే మాట ఖమ్మం జిల్లాలో రావడానికి వీలు లేదని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులకు తన పరిధిలోని రైతుల గురించి సంపూర్ణ సమాచారం ఉండాలని అన్నారు. 9 రోజుల వ్యవధిలో 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో ప్రభుత్వం జమ చేసి, వ్యవసాయ రంగ ప్రాధాన్యతను తెలియజేసిందని, ప్రతి మండల వ్యవసాయ అధికారి తన పరిధిలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. జిల్లాలో ఎరువులు, విత్తనాల స్టాక్ లభ్యత వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో అప్ డేట్ కావాలని అన్నారు. మన దేశం ప్రతి సంవత్సరం వేల కోట్ల విలువ చేసే ఆయిల్ పామ్ దిగుబడి చేసుకుంటున్నదని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ పంట ఎక్కువ మొత్తంలో విస్తరించాలని అన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ లక్ష్యం చేరుకోవాలని, ప్రతి క్లస్టర్ కు ఒకే రకమైన లక్ష్యాలు కాకుండా స్థానిక పరిస్థితుల కనుగుణంగా ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను నిర్దేశించాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తనకు కేటాయించిన ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను పూర్తి చేయాలని, రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని అన్నారు. వరి పంట వైపు మాత్రమే రైతు మొగ్గు చూపకుండా లాభసాటి పంటల సాగు జరిగేలా చూడాలని అన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చిన రైతుల నుండి, రైతు వాటా డీడీలు తీసుకోవాలని, ప్రభుత్వం నుంచి అవసరమైన మంజూరు పత్రాల జారీ వెంటనే జరిగేలా చూడాలని అన్నారు. ఆధునిక సాంకేతికత ద్వారా వ్యవసాయం సాగు చేయడం వల్ల రైతులకు కలిగే లాభాలను వివరించాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు వారి పరిధిలో ఎరువుల వినియోగం తగ్గించడం, నేచరల్ ఫార్మింగ్ పెంచడం, సాగు దిగుబడి పెంచడం వంటి అంశాలపై దృష్టి సారించి రైతులకు తరచూ అవగాహన కల్పించాలని అన్నారు. పొలం మధ్యలో ఫిష్ పాండ్ అభివృద్ధి చేయడం వల్ల వచ్చే లాభాల గురించి రైతులకు వివరించాలని అన్నారు. ప్రతి ఇంచ్ భూమి పూర్తి స్థాయిలో వాడుతూ రైతుల ఆదాయం పెంచెందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నేచరల్ ఫార్మింగ్ జరిగే పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తానని అన్నారు. జిల్లాలో ఇతర రైతులకు కూడా నేచరల్ ఫార్మింగ్ పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. నేచరల్ ఫార్మింగ్ చేసే రైతులతో సాధారణ



రైతులకు అవగాహన కల్పన కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, ఇంచార్జ్ జిల్లా ఉద్యానవన అధికారి ముత్యాలు, కూసుమంచి, వైరా, ఖమ్మం అర్బన్, సత్తుపల్లి, మధిర ఏడిఏలు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, హార్టికల్చర్ అధికారిణి అనిత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# 'విజ్జూ.. నువ్వు గర్వపడేలా చేస్తా..'

### విజయ్ దేవరకొండకు ప్రామిస్ చేసిన రష్మిక


మూవీ న్యూస్, 28 జూన్ (కెరటం న్యూస్): భిన్నమైన కథలకు ప్రాధాన్యమిస్తానంటూ రష్మిక 'మైసా' అనే కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసిన విషయం తెలిసిందే. ఆమె ప్రధాన పాత్రలో రానున్న ఈ సినిమా పోస్టర్ లుక్ అందరినీ ఆశ్చర్యపరిచింది. దీంతో రష్మికకు ఆల్ ది బెస్ట్ చెబుతూ సినీ ప్రముఖులు పోస్టులు పెట్టారు. నటుడు విజయ్ దేవరకొండ కూడా ఇన్‌స్టాలో ఆమెకు అభినందనలు చెప్పారు. దీనికి ఆమె ఇచ్చిన రిప్లై ఇప్పుడు అందరినీ ఆకర్షిస్తోంది.

'ఇది అద్భుతంగా ఉండనుంది' అని విజయ్ దేవరకొండ 'మైసా' పోస్టర్‌ను షేర్ చేశారు. దీన్ని రీషేర్ చేసిన రష్మిక.. 'విజ్జూ.. ఈ సినిమాతో నేను నిన్ను గర్వపడేలా చేస్తానని మాటిస్తున్నా" అని క్యాప్షన్ పెడుతూ ఒక హార్ట్ ఎమోజీని జోడించారు. విజయ్‌ను ఆమె విజ్జూ అని పిలవడంతో మరోసారి ఈ జంట హాట్ టాపిక్‌గా మారింది. కొన్ని రోజులుగా వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారంటూ వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఇటీవల కూడా ఇద్దరూ ఒకే కారులో ప్రయాణిస్తున్న దృశ్యాలు వైరల్‌గా మారాయి.

ఇక వరుస విజయాలతో ఉన్న రష్మిక తాజాగా మరో భారీ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. 'ఇంతకుముందు ఎప్పుడూ పోషించని పాత్ర.. నేనెప్పుడూ అడుగుపెట్టని ఓ ప్రపంచం.. ఇప్పటివరకూ నేను కలవని నా మరో రూపం..' అంటూ తన కొత్త సినిమా 'మైసా' పోస్టర్‌ను షేర్ చేశారు. ఈ సినిమాతో రవీంద్ర పుల్లె దర్శకుడిగా పరిచయం కానున్నారు. విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్'తో బిజీగా ఉన్నారు.

# విండీస్‌ను కూల్చిన హేజిల్‌వుడ్..

# తొలి టెస్టులో ఆసీస్ విక్టరీ



**స్పోర్ట్స్ న్యూస్ ,28 జూన్ (కెరటం న్యూస్):** వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ **2025-27** సైకిల్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు మూడు టెస్టుల, ఐదు టీ20ల సిరీస్ కోసం వెస్టిండీస్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బార్బోడస్ వేదికగా జరిగిన తొలి టెస్టులో వెస్టిండీస్‌ను 159 పరుగుల తేడాతో ఆసీస్ చిత్తు చేసింది. కంగారుల నిర్దేశించిన 300 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక కరేబియన్లు చతికలపడ్డాడు. ఆసీస్ బౌలర్లు చెలరేగడంతో విండీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 141 పరుగులకే కుప్పకూలింది. టెయిలాండర్ షమీర్ జోషఫ్(44), జస్టిన్ గ్రీవ్స్(38) పర్వాలేదన్పించగా.. మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో జోష్ హాజిల్‌వుడ్ ఐదు వికెట్లతో చెలరేగగా.. నాథన్ లియోన్ రెండు, స్టార్క్, కమ్మిన్స్ తలా వికెట్ సాధించారు.

**ఆదుకున్న హెడ్, వెబ్‌స్టెర్**

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 81.5 ఓవర్లలో 310 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు కొన్‌స్టాస్ (5), ఉస్మాన్ ఖ్వాజా (15), కామెరూన్ గ్రీన్ (15), జోష్ ఇంగ్లిష్(12) విఫలమవడంతో ఒక దశలో 65/4తో కష్టాల్లో పడ్డ జట్టును హెడ్(61), వెబ్‌స్టర్(63) ఆదుకున్నారు.

అదేవిధంగా వికెట్ కీపర్ బ్యాటర్ అలెక్స్ కారీ(65) అర్ధశతకంతో రాణించాడు. కరీబియన్ బౌలర్లలో షమార్ జోసెఫ్ 5 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులకు... విండీస్ 190 పరుగులకు ఆలౌట్ అయ్యాయి. రెండు ఇన్నింగ్స్‌లలోనూ హాఫ్ సెంచరీతో మెరిసిన ట్రావెస్ హెడ్ మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు. ఇరు జట్ల మధ్య రెండో టెస్టు గ్రెనడా వేదికగా వచ్చే గురువారం నుంచి ప్రారంభం కానుంది.

# ఎటు చూసినా ఏడుపులు..

# ఎదురు చూపులే!



మూవీ న్యూస్, 28 జూన్ (కెరటం న్యూస్): ఇటీవలే 'అనగనగా' చిత్రంతో ప్రేక్షకుల్ని మెప్పించింది ప్రముఖ ఓటీటీ సంస్థ ఈటీవీ విన్ . ఇప్పుడీ వేదిక నుంచి రానున్న కొత్త వెబ్ సిరీస్ 'కానిస్టేబుల్ కనకం' . వర్ష బొల్లమ్మ టైటిల్ పాత్రలో నటించిన ఈ సిరీస్‌ను ప్రశాంత్ కుమార్ దిమ్మల తెరకెక్కించారు. కోవెలమూడి సత్యసాయిబాబా, వేటూరి హేమంత్ కుమార్ సంయుక్తంగా నిర్మించారు. అవసరాల శ్రీనివాస్, రాజీవ్ కనకాల, మేఘలేఖ, రమణ భార్గవ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సిరీస్ త్వరలోనే ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార పర్వంలో భాగంగా 'ఫస్ట్ బుల్లెట్' పేరుతో శుక్రవారం ఈ సిరీస్ టీజర్‌ని విడుదల చేశారు.

రేపల్లె అనే మారుమూల గ్రామంలో 1998లో జరిగే కథ ఇది. ఆ ఊరిలోని పలువురు అమ్మాయిలు ఒకరి తర్వాత ఒకరిగా అదృశ్యమవడం.. ఆ కేసును ఛేదించేందుకు కానిస్టేబుల్ కనకమహాలక్ష్మి రంగంలోకి దిగడాన్ని ప్రచార చిత్రంలో ఆసక్తికరంగా చూపించారు. "ఊరికి ఏదో పీడ పట్టేసినట్లు ఉంది. ఎటు చూసినా ఏడుపులు, ఎదురు చూపులు" అంటూ ప్రచార చిత్రంలో వినిపించిన సంభాషణ ఈ సిరీస్‌పై ఆసక్తిని రెట్టింపు చేసేలా ఉంది. దీనికి సంగీతం: సురేశ్ బొబ్బిలి, ఛాయాగ్రహణం: శ్రీరామ్ ముక్కపాటి.

# ఖమ్మంలో ఇండిగో హెూమియో హాస్పిటల్



## లాంచనంగా ప్రారంభించిన డా.తుమ్మల యుగంధర్




**వనం నాగయ్య, కెరటం న్యూస్**

ఖమ్మం నగరంలోని వైరా రోడ్‌లో గల ఆర్‌సీఎం చర్చి ఎదురుగా పల్స్ హాస్పిటల్ ఎదురుగా బాలాజీ నగర్‌లో ఇండిగో హెూమియో హాస్పిటల్‌ను శనివారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, జౌళిశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డా.తుమ్మల యుగంధర్ లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్ బీసీ క్లమెంట్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగొర్ల హనుమంతరావు, ఇండిగో హెూమియో హాస్పిటల్, గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సాధించిన ప్రముఖ హెూమియో వైద్యులు డా.శ్రీనాథ్, ఇండిగో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆరిఫ్, డా.ఆతీఫ్, పి.ప్రసన్న కుమార్ తదితరులతో కలిసి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డా. తుమ్మల యుగంధర్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డా.తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ..తాను అల్లోపతి వైద్యుడినే అయినా హెూమియో పతి వైద్యాన్ని అంగీకరిస్తానని అన్నారు. ముఖ్యంగా చిన్నారుల్లో ఎదురయ్యే రుగ్మతలను తట్టుకునేందుకు హెూమియో వైద్యం చక్కని పరిష్కారం అని అన్నారు. చిన్న పిల్లలతో పాటు యువకులు, మహిళల సమస్యలకు కూడా హెూమియో చక్కని పరిష్కార మార్గం చూపుతుందన్నారు. మారుతున్న సమాజంలో ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంపూర్ణ ఆరోగ్యం కోసం ఆధునిక వైద్యం ఖమ్మంలో అందుబాటులో ఉందన్నారు. హైదరాబాద్ తరువాత ఖమ్మం వైద్య రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు సాధించిందని, ఖమ్మంలో హైదరాబాద్ తరహా వైద్యం అందుబాటులో ఉండటం మనందరికీ గర్వకారణమని డా.తుమ్మల యుగంధర్ ప్రకటించారు. ఆధునిక వైద్యం అందుబాటులో ఉంటేనే ప్రజల ప్రాణాలకు మరింత రక్షణ ఉంటుందన్నారు. అందుకే మారిన పరిస్థితుల్లో హెూమియో వైద్యం కూడా అవసరమేనని అన్నారు.

ఇండిగో హెూమియో వైద్యశాల ప్రధాన వైద్యులు డా. శ్రీనాథ్ మాట్లాడుతూ...దీర్ఘకాలిక వ్యాధులకే కాకుండా అన్ని రకాల వ్యాధులకు కూడా హెూమియో చక్కని వైద్యం అన్నారు. ముఖ్యంగా చిన్నారుల్లో ఆటిజం, థైరాయిడ్, హైపో థైరాయిడ్, థైరాయిడ్ కణితి పెరుగుట, మానసిక ఒత్తిడి, సంతాన లేమి, అధిక బరువు, పీసీఓడీ, వీర్యకణాల ఉత్పత్తి లేకపోవడం, హైపటైటిస్–బి నుండి రక్షణ, అత్యాధునిక చికిత్సతో నివారణ, క్రానిక్ స్టేజీ ఆక్యూట్ స్టేజీ, ఆడమగ సంతాన లేమి సమస్యలు, సెక్సు సమస్యలు, హార్మోను సమస్యలు, సోరియాసిస్, ఎగ్జిమా, తెల్లమచ్చలు, ఆర్టికెరియా, అన్ని రకాల చర్మ సమస్యలు, ఆస్తమా, సైనసైటిస్, తుమ్ములు, తరచు జలుబు, జ్వరం, ముక్కు కారడం, గురక, తలనొప్పి, పిల్లల్లో తీవ్ర ప్రభావం చూపుతున్న ఆటిజం, ఇలాంటి మరెన్నో ఆరోగ్య సమస్యలకు ఇండిగో హాస్పిటల్ చక్కని పరిష్కారం చూపుతుందన్నారు.

### జ్యోతి ప్రజ్వలన చేసిన డా.తుమ్మల

శనివారం మధ్యాహ్నం కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డా. తుమ్మల యుగంధర్ కార్పొరేటర్ బీసీ క్లమెంట్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగొర్ల హనుమంతరావు, ఇండిగో హెూమియో హాస్పిటల్, గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సాధించిన ప్రముఖ హెూమియో వైద్యులు డా.శ్రీనాథ్, ఇండిగో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆరిఫ్, డా.ఆతీఫ్, పి.ప్రసన్న కుమార్ తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం డాక్టర్ రూమ్‌ను, మెయిన్ హాస్పిటల్‌లో ఉన్న వివిధ గదులను ప్రారంభించారు. అనంతరం డా.తుమ్మల యుగంధర్ అక్కడ ఉన్న హెూమియో మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏ ఏ మందులు ఎలా పనిచేస్తాయని డా.శ్రీనాథ్ వివరించారు. ఈ సమయంలోనే డా. తుమ్మల యుగంధర్‌కు డా.శ్రీనాథ్ బీపీ పరిక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డా. భావన, మైనారిటీ ఆర్ఎంపీల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు షేక్ నజీర్, హసన్, పలువురు ప్రయివేటు వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇండిగో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆరిఫ్‌కు అభినందనలు తెలిపారు.







